మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

## ఇందిరమ్మ పథకం ద్వారా

# అర్హులకు లాభం జరగాలి

### అధికారులకు జిల్లా కలెక్టర్ సంతోష్ ఆదేశాలు



ఇందిరమ్మ ఇండ్ల సర్వేను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, డిసెంబరు 11 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు ఇళ్ల లబ్ధి చేకూర్చేందుకు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని కొండేర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ప్రక్రియను అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు పథకానికి ఎవరైతే దరఖాస్తు చేసుకున్నారో వారి వివరాల సేకరణను మొబైల్ యాప్‌లో పొందుపరచడానికి ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్ లైన్ ద్వారా సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్న తీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం కలిగి ఉన్నారా, ఉందా? ఇంట్లో వివాహిత జంటల సంఖ్య, ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఎవరు, పాత పెంకుటింట్లో ఉంటున్నారా లేక పక్క గృహమా తదితర అంశాలను పరిశీలిస్తూ ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేశారు. జియో టాకింగ్ ద్వారా ఫోటో తీసుకోబడుతుందనీ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల యాప్ లాగిన్ ఐడిలు అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తుదారుల వివరాలను పక్కాగా సేకరిస్తూ, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా యాప్‌లో వివరాలను అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. సర్వే ప్రక్రియను నిబద్ధతతో చేపడుతూ గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్యామ్ సుందర్, ఎం.పి.డి.ఓ అజార్ మొహియుద్దీన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం ఆహారం వడ్డించాలి

### ఆహారం నాణ్యతగా ఉండాలి.. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు..

### జడ్చర్లలో విద్యాలయాలు తనిఖీ చేసిన కలెక్టర్ విజయేంద్ర బోయి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

**జడ్చర్ల, డిసెంబరు 11 ప్రభాతవార్త:** విద్యార్థిని లకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. బుధవారం జడ్చర్ల పట్టణంలోని తెలంగాణా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనంలో మాడిపోయిన అన్నం వడ్డించడం గమనించి జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎటువంటి అజాగ్రత్త, నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వంట గది, స్టోర్ రూం పరిశీలించారు. వంట గది పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ విద్యార్థిని లతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థినిలతో మాట్లాడి ఆహారం, బోధన గురించి తెలుసుకున్నారు.

## నిరుపేదలకు సొంతింటి

# కల నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

### అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, డిసెంబరు 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఎంతో ప్రణాళికా బద్ధంగా ప్రభుత్వం ఇల్లు కావలసిన నిరుపేదలు దరఖాస్తులు చేసుకున్న వివరాలను వారికి మొబైల్ యాప్ ద్వారా సేకరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవల సచివాలయంలో మొబైల్ యాప్ ను ప్రారంభించినట్లు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన ఉప్పునుంతల లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ నమూనాకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పకడ్బందీగా, తప్పిదాలకు తావు లేకుండా పారదర్శకంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అధికారుల సమక్షంలో అర్హులైన నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపట్టి అందజేయడం జరుగుతుందని, ఎవరికి ఎలాంటి అనుమానం లేకుండా ప్రభుత్వమే పారదర్శకంగా నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎంఎల్ఏ డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు హౌజింగ్ డిఇ ఆనంద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ జడ్పీటిసి అనంత ప్రతాపరెడ్డి, ఎంపిడిఒ మోహన్‌లాల్, డిసిసి ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగత్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్, ప్రస్తుతం సింగిల్ విండో డైరెక్టర్ మద్దు నరేందర్‌రెడ్డి, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ కట్టశేఖర్ రెడ్డి, బొల్లె లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ కార్నె లక్ష్మినారాయణ, కొత్త చిన్న జంగిరెడ్డి, గోపిరెడ్డి రఘుపతి రెడ్డి, హౌసింగ్ ఎఇ రాజ వర్ధన్ రెడ్డి, సూరం ప్రశాంత్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోడమోని భాస్కర్, శేఖర్ గౌడ్, సి హెచ్ శ్రీనివాసులు, బిసి సెల్ మండల అధ్యక్షుడు మద్ది తిరుపతయ్య గౌడ్, అన్ని శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇరిగేషన్ శాఖ సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఉమ్మడిజిల్లా ఎమ్మెల్యే లు

**దేవరకద్ర, డిసెంబరు 11 ప్రభాతవార్త :** హైదరాబాద్ లోని జలసౌధలో బుధవారం జరిగిన ఇరిగేషన్ శాఖ సమీక్ష సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమీక్ష సమావేశంలో మహబూబ్‌గర్ జిల్లా ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ అధికారులు కూడా పాల్గొన్నారు. సమావేశానికి దేవరకద్ర ఎమ్మెల్యే కూడా హాజరై సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

# పెండింగ్ @100 కోట్లు



- అవధులు దాటినా సీఎంఆర్ బకాయిలు
- ఏటా పెరుగుతున్న ఎగవేత దారులు
- పేరుకే రెవెన్యూ రికవరీ యాక్టు
- గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులు, మిల్లర్లు
- మిల్లర్లకు గడువు మరోసారి పెంచిన సర్కార్

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 11 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో కస్టం మిల్లింగ్ మిల్లర్లు వందల కోట్లల్లో ధాన్యాన్ని మింగేశారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం మరాడించి ఎఫ్సీఐకి అందజేయకుండా బహిరంగ మార్కెట్లో విక్రయించి సొమ్మును అప్పనంగా మింగేసి పౌరసరఫరాల శాఖకు మొండచేయి చూపుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మిల్లర్లు వందల కోట్లలో కాజేశారు. వనపర్తి జిల్లాలోని మిల్లుల నుంచి దాదాపు రూ.100 కోట్లకు పైగా విలువ చేసే సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్న మిల్లర్లపై జరిమానాలు, కేసులు విధిస్తున్నా వారి తీరు మారడం లేదు. జిల్లా వ్యాప్తంగా 2020-21 రబీ సీజన్ నుంచి బకాయిలు పేరుకుపోవడంతో జిల్లావ్యాప్తంగా మిల్లర్లపై 42 క్రిమినల్ కేసులతో పాటు, 32 ఆర్ఆర్ యాక్ట్ కేసులు నమోదు చేశారు. సంబంధిత శాఖల అధికారులు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారే తప్ప వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జిల్లాలో ధాన్యం తీసుకుని బియ్యం అప్పగింతలో మిల్లర్లు సంవత్సరాల పాటు జాప్యం చేస్తున్నారు. గతంలో బియ్యం ఇవ్వకున్నా ఇబ్బడి ముబ్బడిగా మిల్లుల సామర్థ్యానికి మించి మరి పౌరసరఫరాల శాఖ అధికారులు ధాన్యం కేటాయింపులు జరపడం గమనర్హం. వనపర్తి జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌కు రూ.100 కోట్లకు పైగా రావాల్సి ఉందని పౌరసరఫరాల శాఖ అధికారులు బాహాబాటంగానే చెబుతున్నారు. సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్న మిల్లర్లపై జరిమానాలు, కేసులు విధిస్తున్నా వారి తీరు మారడం లేదు. ప్రతీ సీజన్లో ప్రభుత్వమే రైతుల నుంచి మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరుపుతోంది. ధాన్యాన్ని జిల్లాలో ఉన్న మిల్లులకు కేటాయిస్తే మిల్లర్లు సీఎంఆర్ చేసి తిరిగి అందించాలి. బియ్యాన్ని ఎఫ్సీఐ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు అప్పగిస్తే రేషన్ షాపుల్లో లబ్దిదారులకు పంపిణీ చేస్తారు. అయితే ధాన్యం తీసుకుంటున్న మిల్లర్లు బియ్యం ఇవ్వడం లేదు. క్రిమినల్ కేసులు నమోదైనా.... జిల్లాలో కొన్ని మిల్లుల నుంచి ధాన్యం వసూలు పూర్తిగా అటకెక్కింది. సదరు మిల్లుల యజమానులకు నోటీసులు అందజేసిన అధి కారులు ఆర్ఆర్ యాక్టును నిర్దిష్టంగా అమలు చేయడంలో విఫలమయ్యారు. నష్టపోయామని నోటీసులకు బదులిచ్చిన మిల్లర్లు ఆ తర్వాత తమకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టుకు వెళ్లడం గమనార్హం. మిల్లుల ఆస్తుల వేలం వేసేందుకు అనుమతుల విషయంపై పౌరసరఫరాల శాఖ అధికారులు సైతం విఫలయత్నం అయినట్లు సమాచారం. ఆయా సీజన్లో ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని స్వీకరించిన మిల్లుల యజమానులు అక్రమంగా బహిరంగ మార్కెట్లో అమ్మేసుకున్నారు. ఇలాంటి మిల్లులపై పౌరసరఫరాల శాఖ అధికారులు ఆయా మండలాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటాయింపు చేసిన ప్రభుత్వ ధాన్యాన్ని ఇష్టారాజ్యంగా బుక్కేశారు. అక్రమాలకు పాల్పడిన మిల్లర్ల వెనుక గత ప్రభుత్వంలోని బీఆర్ఎస్ పార్టీలో ఉన్న కీలక నేతల అండదండలు ఉండటంతో పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలతో పాటు మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేశారు. మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ ధాన్యాన్ని మాయం చేసిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినా వారిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా సీఎంఆర్ బకాయిదారులపై 32 ఆర్ఆర్ యాక్టు కేసులు నమోదయ్యాయి. మిలర్లపై కేసులు నమోదు చేసినప్పటికీ బెయిల్ తెచ్చుకుని దర్జాగా ఏప్పటిలాగే వ్యాపారాలు చేసుకుంటున్నారు. సీఎంఆర్ అప్పగింత విషయంలో వారు ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల నామమాత్రపు చర్యలతో రికవరీ సాధ్యం కాదని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి గట్టి ఆదేశాలు వస్తేనే రికవరీ జరుగుతుందన్న అభిప్రాయం ఉన్నతధికారుల నుంచి వ్యకతమవుతోంది.

**మరోసారి గడువు పెంచిన ప్రభుత్వం....**

కొన్ని ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న సీఎంఆర్ ధాన్యాన్ని రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరొకసారి గడువు పెంచింది. గత నెల నవంబర్ 30వ తేదీ వరకు పెండింగ్లో ఉన్న -మిగతా4లో..

# ఇల్లు లేని నిరుపేదలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం



వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ఇన్‌సెట్లో కలెక్టర్

**వనపర్తిప్రతినిధి డిసెంబరు 11 ప్రభాతవార్త :** ఇల్లు లేని నిరుపేదలకు లబ్ది చేకూర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని, నాణ్యతగా సర్వే చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. బుధవారం సీఎస్ శాంతి కుమారితో కలిసి ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే అంశంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే ప్రాజెక్ట్ ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని, నాణ్యతగా సర్వే చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 6892 ఇళ్లను ఇందిరమ్మ ఇండ్ల యాప్‌ద్వారా సర్వే చేయడం జరిగిందన్నారు.

**పకడ్బందీగా గ్రూప్ 2 పరీక్ష నిర్వహించాలి**

గ్రూప్ 2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్ శాంతి కుమారి ఆదేశించారు. వంద శాతం - మిగతా4లో..

## జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

- సినీ నటుడు మోహన్ బాబుపై చర్యలు తీసుకోవాలి
- దాడిని నిరసిస్తూ మహబూబ్‌నగర్, జడ్చర్లలో ఐజేయు ఆధ్వర్యంలో నిరసన



మహబూబ్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు11 ప్రభాతవార్త:** వార్తను కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై సినీనటుడు మోహన్ బాబు దాడిని ఖండిస్తూ టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్నగర్, జడ్చర్లలో జర్నలిస్టులు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికే విరుద్ధమని, దాడి చేసిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవాలను జనాలకు చూపించేందుకు తాపత్రయ పడుతున్న జర్నలిస్టులపై వ్యక్తిగతంగా దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం వివిధ జర్నలిస్ట్ సంఘాల నాయకులు, నియోజకవర్గం జర్నలిస్టులు అందరూ కలిసి మహబూబ్‌గర్ ఎస్పీ జానకికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దత్తేందర్, రామాంజనేయులు, యూనియన్ నాయకులు జర్నలిస్టులు వెంకటయ్య, శేఖర్ గౌడ్, గోకులం వెంకటేష్, తిరుపతయ్య పాల్గొన్నారు.

**జడ్చర్లలో..** జడ్చర్ల లోని సిగ్నల్ గడ్డ వద్ద అంబేద్కర్ చౌరస్తాలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున మోహన్‌బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విధుల్లో ఉన్న జర్నలిస్టుపై దాడి చేయడం హేయమైన చర్య అని మోహన్‌బాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అనంతరం జడ్చర్ల పోలీస్ స్టేషన్కు చేరుకొని సిఐ ఆదిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐజేయు నియోజకవర్గ అధ్యక్షుడు నరేందర్, జర్నలిస్టులు యూనియన్ నాయకులు అమర్, రవి, శ్రీధర్, అహ్మద్, డేవిడ్, మల్లేష్, నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి:జిల్లా కలెక్టర్



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలన చేస్తున్న కలెక్టర్

**గద్వాల, డిసెంబరు11 ప్రభాతవార్త :** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లాకలెక్టర్ బి.ఎం.సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని కొండేర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న - మిగతా4లో..

# సైన్స్‌తోనే మానవుని మనుగడ..

- విద్యార్థుల మేధ శక్తికి సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయి
- విద్యార్థుల ప్రదర్శనను తిలకించిన కలెక్టర్
- జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే
- నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థులు దేశ ప్రతిష్టను పెంచేలా శాస్త్రవేత్తలుగా రూపొందాలి
- నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి



విద్యార్థుల నృత్యాలు



సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న జిల్లా కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 11 ప్రభాతవార్త:** సైన్స్‌తోనే మానవుడి మనుగడ ముడిపడి ఉందని, విద్యార్థులు కొత్త ఆవిష్కరణలను రూపొందించి నాగర్‌కర్నూలు జిల్లా ప్రతిష్టను దేశ స్థాయిలో ఇనుమడింపజేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష‌రెడ్డిలు విద్యార్థులకు సూచించారు. జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలు 2024 కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, సభాధ్యక్షులుగా నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలు పాల్గొన్నారు. మొదటగా విశ్వశాంతి హైస్కూల్ చారగొండ విద్యార్థులు సుస్వాగత గీతాన్ని ప్రదర్శించగా, కల్వకుర్తి కేజీబీవి, లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో, ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ యావత్తు మానవ మనుగడ సైన్స్‌తో ముడిపడి ఉందని, మానవునికి ఎదుగుదలకు సైన్సు అత్యంత కీలకమని కలెక్టర్ తెలిపారు. పూర్వపు రోజుల్లో రవాణా సౌకర్యానికి ఎంతో కష్టనష్టాలు ఉండేవని, ప్రస్తుత కాలంలో ప్రపంచ దేశాలను చుట్టి వచ్చేలా అత్యాధునిక పద్ధతుల్లో రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందాయని అందుకు ప్రధాన కారణం సైన్స్ అని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి సైన్స్‌లో ప్రయోగాలు, నూతన ఆవిష్కరణలు రూపొందించే దిశగా ఎదగాలని సూచించారు.



విద్యార్థి జీవితంలో సమయమును సద్వినియోగం చేసు కున్న వాళ్లే విజేతలుగా నిలుస్తారన్నారు. "విద్యతోపాటు, లోతైన పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయని కొనియా డారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్నివెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు జిల్లా ప్రతిష్టను దేశస్థాయిలో రాణించేలా, జిల్లా నుండి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటుచేసిన జిల్లా విద్యాశాఖాధికారి, విద్యాశాఖ సిబ్బందికి సైన్స్ ఉపాధ్యాయులకు కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అన్ని పాఠశాలల విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలను తిలకించేలా అధి కారులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నాగర్‌క ర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచ కుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతివ్యక్తి మెదడు సైన్స్‌తోనే అనుసంధానం అయి ఉంటుం దని తెలిపారు. తను కూడా సైన్స్ విద్యార్థిని, ఒక డాక్టర్‌గా సైన్స్ విలువ సమాజంలో ప్రాముఖ్యత తనకు తెలుసునని ఈ సందర్భంగా చెప్పారు. జిల్లా ప్రతిష్టను ప్రపంచ స్థాయిలో రాణించే దిశగా శాస్త్రవేత్తలు తయారు కావాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కోరారు.



విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాల్లో రాణించాలన్నారు. నేటి బాలలే భావి భారత శాస్త్రవేత్తలని, అదిశగా విద్యార్థుల ఆలోచనలు ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్స హించాలని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తెలిపారు. నాగర్‌క ర్నూల్ డీఈఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ మానవ మనుగడకు ముడిపడి ఉన్న సైన్సును విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు జిల్లాస్థాయి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. విద్యార్థులు ఎంతోమంది శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన ప్రదర్శన గదులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, డీఈఓ రమేష్‌కుమార్ ప్రారంభించి విద్యార్థుల రూపొందించిన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి ప్రదర్శనల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన చారగొండ విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థులు, కల్వకుర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులు, లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల నృత్యాలను తిలకించి విద్యార్థులను ప్రత్యేకంగా కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈవో అభినందించారు. జిల్లావ్యాప్తంగా 400 పాఠశాలల నుండి 512 ప్రదర్శనలను విద్యార్థుల రూపొందించారు. మూడు రోజులపాటు నిర్వహించే జిల్లా స్థాయి ప్రదర్శనలను జిల్లాలోని విద్యార్థులందరూ తిలకించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ఉపాధ్యాయుడు గుడిపల్లి నిరంజన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు, నోడల్ అధికారి కురుమయ్య, ఏసీ రాజశేఖర్ రావు, జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ సైన్స్ బయో సైన్స్ ఉపాధ్యాయులు, గైడ్ టీచర్లు 1500 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతల ఆశీస్సులు ఉంటే అన్ని శుభాలే

**పోచమ్మ దేవాలయం పునః నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కల్వకుర్తి, డిసెంబరు 11 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలోని హనుమాన్‌నగర్ కాలనీలో గ్రామ దేవత పోచమ్మ దేవాలయం పునఃనిర్మాణానికి బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులు ఉంటే అన్ని శుభాలే కలుగుతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని పోచమ్మ దేవాలయం పునఃనిర్మాణ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. అయన వెంట పొల్యూషన్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, రైస్ మిల్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జులూరి రమేష్‌బాబు, నాయకులు చంద్రకాంత్ రెడ్డి, సంజీవ్‌కుమార్ యాదవ్, కౌన్సిలర్‌లు, మార్కెట్ డైరెక్టర్‌లు, పోచమ్మ దేవాలయం పునః నిర్మాణాని కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోహన్‌బాబుపై కేసు నమోదు చేయాలి

**కొల్లాపూర్, డిసెంబరు 11 ప్రభాతవార్త :** నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో సినీ హీరో మోహన్ బాబు పై కొల్లాపూర్ టియుడబ్ల్యుజె (ఐజెయు) యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు మాలే రాజేందర్ ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని జల్‌పల్లి లో సినీన టుడు మోహన్ బాబు ఆయన బౌన్సర్లు మీడియా ప్రతినిధులపై దాడి చేయడాన్ని జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో తీవ్రగాయాల పాలై మీడియా ప్రతినిధులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, జర్నలిస్టుల పై హత్యాయత్నానికి పాల్పడిన మోహన్‌బాబుతో పాటు బౌన్సర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కొల్లాపూర్ సిఐ మహేష్ కు, కొల్లాపూర్ రాజాస్వ మండలాదికారి బన్సీలాల్ కు కొల్లాపూంటియుడబ్ల్యుజె (ఐజెయు) యూనియన్ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలోటియుడబ్ల్యుజె (ఐజెయు) యూనియన్ కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మాలే రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు పుల్లయ్య, సురేష్, కోశాధికారి, నరసింహ, జర్నలిస్టులు వినోద్, వెంకటస్వామి, కేశవ్, రాజేష్ గౌడ్, చాంద్ పాషా, వెంకటేష్ చారి, సతీష్, రాయుడు, వీరాచారి, రమేష్‌లు పాల్గొన్నారు.

## ఐఎస్‌గా ఎంపికైన చంద్రశేఖర్‌రెడ్డికి సన్మానం

**ఉప్పునుంతల, డిసెంబరు 11 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామానికి చెందిన కట్ట చంద్రశేఖర్ రెడ్డి ఐఏఎస్ గా ఎంపికైన సందర్భంగా బుధవారం తన స్వగ్రామానికి రావడంతో గ్రామస్తులు, రెడ్డి సోదరులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఐఏఎస్ గా ఎంపికైన ఎండి, విజయ డైరీ ఎండి గా బాధ్యతలు స్వీకరించి, మొట్ట మొదటి సారిగా స్వగ్రామానికి రావడంతో రెడ్డి సోదరులు, మహిళలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎస్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 90 కోట్ల చెల్లించాల్సి ఉందని, విజయ డైరీ ఎండి కట్ట చంద్రశేఖర్ రెడ్డి రైతులకు ఈనెల 15 రోజులకు సంబంధించిన బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 50 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపిందని, విజయ డైరీ కి అధికంగా పాలు వస్తున్నాయన్నారు. ఎండి గా బాధ్యతలు స్వీకరించిన తదుపరి రాష్ట్రవ్యాప్తంగా 50 వేల లీటర్ల వ్యాపారం పెరిగిందన్నారు. త్వరలోనే రైతుల బకాయిలను చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. సన్మానించిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్, ప్రస్తుతం సింగిల్ విండో డైరెక్టర్ మద్దు నరేందర్ రెడ్డి, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్ట గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కట్ట సరిత, మాజీ సింగిల్ విండో చైర్మన్ కట్ట చంద్ర రెడ్డి, పెద్ది రెడ్డి బూసి రెడ్డి, కట్ట షణ్ముఖ రెడ్డి, కట్టపర్వత్ రెడ్డి, కట్ట గోవర్ధన్ రెడ్డి, కట్ట శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలి

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 11 ప్రభాతవార్త :** విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని డాక్టర్ రామచంద్రరావు పేర్కొన్నారు. సోమవారం రాజపేటలో ఉన్నటీటీడబ్ల్యూయూ బాలుర జూనియర్ కళాశాలను సందర్శించిన వనపర్తి ఆహార భద్రతఅధికారి (పిఓఎస్‌సిడి) సందర్శించారు. అనంతరం వంటగది వంట సరుకులను పరిశీలించారు. పరిశుభ్రమైన ఆహారాన్ని వండి, వేడివేడిగా విద్యార్థులకు అందించాలని ప్రిన్సిపాల్‌కు సిబ్బందికి సూచించారు. విద్యార్థులందరికీ ఒత్తిడి నిర్వహణ గురించి, మానసికఒత్తిడిలోఉన్నవారికి టెలిమానస్14416టోల్‌ఫ్రీ గురించి అవగాహన కలిగించారు.

## శాస్త్రీయ ఆలోచనలే ఆధారంగా వైజ్ఞానిక ప్రదర్శన

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 11 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను రేకెత్తించి సమాజానికి ఉపయోగపడే పరిశోధనలను ఆవిష్కరించే విధంగా జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనను డిసెంబర్ 12, 13 తేదీలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో సైన్స్ ఫెయిర్ నిర్వహణ కమిటీలతో ఏర్పాటుచేసిన సమావేశంలోడి ఈవో మాట్లాడారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో ఏర్పాటు చేస్తున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రభుత్వ ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలతో పాటు గురుకుల పాఠశాల విద్యార్థులు ఎగ్జిబిట్స్ నుని ప్రదర్శిస్తారని డీఈవో తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జిల్లా విద్య వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయడంలో కీలక పాత్ర అని డీఈఓ అన్నారు. ప్రదర్శనకు వచ్చే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన డీఈఓ కమిటీలను ఆదేశించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ కమిటీలను సమిష్టిగా సమన్వయంగా విద్య వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ పర్యవేక్షకుల శంభు ప్రసాద్ ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ వివిధ కమిటీల కన్వీనర్లు సభ్యులు పాల్గొన్నారు.

## సిఎం కప్ క్రీడలు ప్రారంభించిన ఎంపిడిఓ

**లింగాల, డిసెంబరు 11 ప్రభాతవార్త:** లింగాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన సిఎం కప్ అథ్లెటిక్స్ క్రీడలను బుధవారం ఎంపిడిఓ ఆంజనేయులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రీడల్లో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆడారు. క్రీడల్లో మండలస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి క్రీడలకు పంపిస్తున్నట్లు తెలిపారు. క్రీడలతో యువత ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిడి వెంకటేశ్వర్లు, ఎంపిఓ చంద్రశేఖర్, ఎస్ఓశారద, ఆర్ఐ సితారాంనాయక్, ఆయా పాఠశాలల పిఈటీలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, మల్లయ్య, ఉల్లంగోడ్ల రాజు, అచ్చంపేట మార్కెట్ డైరెక్టర్ ముక్తార్, వెంకట్, మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, విజయలక్ష్మి, నందిని పాల్గొన్నారు.

## ఘనంగా మహారుద్ర హోమం

**దేవరకద్ర, డిసెంబరు 11 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రం సమీపంలోని సిద్ధి వినాయక నగర్ లో కొలువుదీరిన శ్రీ సిద్ధి వినాయక దేవాలయంలో బుధవారం రుద్రహోమం పూజా కార్యక్రమాన్ని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర వేర్ హౌసింగ్ మరియు పిఎఫ్ పి ఎఫ్ టి ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహకులు మా దాడి తరుణ కృష్ణారెడ్డి, అదుసుమిల్లి ప్రశాంతిరాము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా స్వామివారి పంచమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగానే దేవాలయంలో స్వామివారి సన్నిధిలో ప్రతిరోజు పలు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే నిత్య పూర్ణాహుతి పూజా కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామివారిని శోభాయ మానంగా అలంకరించి పలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. నేడు మహా మంగళ నీరాజనం, సిద్ధి వినాయక దేవాలయ పంచమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు భాగంగా గురువారం మహా మంగళ నిరాజన పూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు

**నారాయణపేట టౌన్, డిసెంబరు11 ప్రభాతవార్త:** క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు మున్ముందు మంచి భవిష్యత్తు ఉంటుందని డి వైఎస్ఓ వెంకటేష్ శెట్టి అన్నారు. బుధవారం దామరగిద్ద మండలం క్యాతన్ పల్లి గ్రామంలో మండల స్థాయి సీఎం కప్ క్రీడలు జరిగాయి. ఉద్దేశించి పలువులు మాట్లాడుతూ ప్రతినిత్యం క్రీడలు ఆడడం వలన మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తుంది అన్నారు. విద్యార్థులు గ్రామస్థాయి క్రీడలకు పరిమితం కాకుండా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచాలన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. బహుమతుల దాత అద్దన్ కన్కిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముఖ్య నాయకులు, తహసిల్దార్ జయరాములు, సాయిలక్ష్మి, ఎంఈఓ కృష్ణారెడ్డితో పాటుపీడీలు బాలరాజ్, రత్నయ్య, వేణుగోపాల్, రామకృష్ణ రెడ్డి, పిఈటిలు నారాయణ, శశికాంత్, రమేష్, వెంకట్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

## మహిళపై దాడి : కేసు నమోదు

**ఖిల్లాఘణపురం డిసెంబరు 11 ప్రభాతవార్త :** భూతగాధలో దాయాదుల మధ్యన ఘర్షణ మహిళపై దాడి కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ గౌడ్ కథనం ప్రకారం మండల పరిధిలోని సలికలాపూర్ గ్రామానికి చెందిన బత్తుల అనిత వాళ్ల భర్త వాళ్ళు ముగ్గురు అన్నదమ్ములు వీరికి గతంలో ఇంటి స్థలంజాగా విషయంలో తగాదాలు ఉన్నాయి ఈనెల 10వ తేదీన మధ్యాహ్నం 12 గంటల సమయంలో అనిత మరిది విష్ణు బావ స్వామి ఇద్దరు వచ్చి మేము ఇద్దరం కలిసి బోరు వేసుకుంటున్నామని నీవు కూడా మాతో భాగస్వామ్యం కావాలని అడిగినారు. అనిత తమ దగ్గర డబ్బులు లేవని మేము బోరు భాగస్వామ్యంలో కలవమని చెప్పారు. బోరు వేసేపొలం మీరు తీసుకొని వేరే పొలం నాకు ఇవ్వాలని అనిత వాళ్ళ మరిది బావని అడుగుతుండగా అనితను బూతు మాటలు తిడుతూ కర్రతో దాడి చేశారు. బాధితురాలు అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**■ నిత్యం అధికారులు భోజన తీరును పరిశీలించాలి ■ అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్**

**చిన్నచింతకుంట, డిసెంబరు11 ప్రభాతవార్త:** ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ లు, కస్తూర్బా పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలో చదువు కుంటున్న విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్ లు, కస్తూర్బా గాంధీ పాఠశాల లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్లో వంటగది, వంట సామాగ్రి నిలువ ఉంచే గదులను పరిశీలించి ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని పరిశీలించారు. పురుగు, చిట్టెలు పట్టిన బియ్యాన్ని వండరాదని, నాణ్యమైన బియ్యాన్ని అన్నం వండేందుకు ఉపయోగించాలని ఎస్సీ హాస్టల్ వార్డెన్ ఆదేశించారు. అక్కడి కూరగాయలు, సరుకులను పరిశీలించారు. విద్యతోపాటు విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకునాణ్యమైన భోజనాన్ని అందించాలని, ఎక్కడైనా విమర్శలు వస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో అక్షయ పాత్ర ద్వారా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడే అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషక ఆహారాన్ని అంగన్వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడి



బియ్యాన్ని, భోజనాన్ని పరిశీలిస్తున్న డిషనల్ కలెక్టర్

కూరగాయలను పరిశీలించి విద్యార్థినిలకు రుచికరమైన భోజనం అందించాలని, స్టాక్‌పాయింట్ లోని బియ్యాన్ని తనిఖీ చేశారు. ఇక్కడ కూడా విద్యార్థులకు నాసిరకంగా భోజనాన్ని అందిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతినిత్యం మండల స్థాయి వివిధ శాఖల అధికారులు ఆయా ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న భోజనాన్ని పరిశీలించాలన్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించడంపైసంతృప్తి వ్యక్తం చేశారు. అడిషనల్ కలెక్టర్ వెంట తహసిల్దార్ఎల్లప్ప, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈఓ మురళి కృష్ణ, ఎంపీఓ అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**■ గ్రామాల అభివృద్ధికిపై ప్రత్యేక దృష్టి**

**■ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి**

**బిజినేపల్లి, డిసెంబరు11 ప్రభాతవార్త:** పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించి పిల్లల బంగారు భవిష్యత్తు కల్పిస్తామని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి అన్నారు. కారుకొండ గ్రామంలో ప్రభుత్వపాఠశాల నిర్మాణానికి సరస్వతి దేవి చిత్రపటానికి పూజలు చేసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం ఆత్మ గౌరవం అని భావించే విధంగా పాఠశాలలను తీర్చిదిద్దుతాం అని ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మక విద్యను అందించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. పేదల సంక్షేమమేతమ ప్రభుత్వలక్ష్యమని కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యా అందించి పిల్లల బంగారు భవిష్యత్తు కల్పిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి పేదలకు సంక్షేమ పథకాలు అందే విధంగా ముందుకు సాగుతామన్నారు. పాఠశాల నిర్మాణానికి హెచ్ఈఎస్ కంపెనీ ముందుకు రావడం అభినందనీయమని ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రహ్మణ్యంను అభినందించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న నేరుగా తన దృష్టికి తేవాలన్నారు. రహదారులు విద్యుత్ పాఠశాల వైద్యం



పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

వంటి అవసరాలు ప్రతిగ్రామంలో తీరేలా చూస్తానన్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు భారీ ఎత్తున ఆహ్వానం పలికారు, మొదటగా ఆయన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కథలప్ప, ఏవో నీతిరెడ్డి, ఎంఈఓ రఘునందన్ శర్మ, హెచ్ఎం రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మిద్దె రాములు, మలిశెట్టి వెంకటస్వామి, రామకృష్ణ, కత్తె ఈశ్వర్, మాజీ సర్పంచులుగంగన మోని తిరుపతయ్య అమృత్‌రెడ్డి, రామ్ చందర్, శ్రీశైలం, బాలరాజ్, నాయకులు కాటగౌని శ్రీనివాస్‌గౌడ్, ఖలీల్, నిరంజన్ రావు, మిద్దె మల్లేష్ నరేందర్, వెంకట్రావు, శేఖర్‌గౌడ్, విష్ణు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలలో రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలి

**ఇటిక్యాల, డిసెంబరు 11 ప్రభాతవార్త:** యువత క్రీడలలో ఆసక్తిని పెంచుకొని గ్రామస్థాయి నుండి రాష్ట్ర జాతీయస్థాయిలో ఎంచుకున్న క్రీడలలో రాణించాలని బాలికలు అయితే పి.టి.ఉష. పీవీ సింధు లాగా అలాగే బాలురు అయితే సచిన్ టెండూల్కర్. విరాట్ కోహ్లీ లాగా పేరు పక్క అతను తెచ్చుకునేందుకు క్రీడలలో ఆసక్తిని పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. మండల స్థాయిలో సీఎం క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు హాజరై అల్లంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప. వైస్ చైర్మన్ కుమార్. ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్. తాహసిల్దార్ నరేందర్. ఎంఈఓ అప్సర్ పాష లతో కలిసి వారు క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం కబడ్డీ వాలీబాల్. కోకో ఆడే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో భాగంగా సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొన్న యువత జిల్లా రాష్ట్ర స్థాయిలో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను పాఠశాల తరఫున శాలువతో ఘనంగా సత్కరించారు. వారు సైతం వాలీబాల్ కబడ్డీ క్రీడలను యువతతో కలిసి ఆడారు. అలాగే అంతకుముందు అల్లంపూర్ లోని మాంటేశ్వరి పాఠశాలలో కూడా సీఎం కప్ క్రీడా పోటీలను జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్నీలి శ్రీనివాసులు. అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప. వైస్ చైర్మన్ కుమార్. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాముతో కలిసి వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మద్దిలేటి. జోగులాంబ ఆలయ ధర్మకర్త సభ్యులు



ఇటిక్యాలలో సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా యువతను పరిచయం చేసుకుంటున్న చైర్మన్ నీలి శ్రీనివాసులు, అధికారులు

జగన్మోహన్ నాయుడు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఆనంద్. పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి జితేందర్. ఆర్ ఐ భీమ్ సేన్‌రావు. పీఈటీలునరసింహరాజు. దేవేందర్. సునీత పాల్గొన్నారు.

**మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన చైర్మన్:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించిన అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్. మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు జయ చంద్రారెడ్డి. రామచంద్రారెడ్డి. రాజ్ కుమార్. అల్లా బకాష్. ఈదన్న నాయుడు. రాజు తదితరులు కలిసి విద్యార్థులకు వండి పెట్టే మధ్యాహ్న భోజనాన్ని వండిన కూరను రుచి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండి పెట్టే మధ్యాహ్న భోజనం నాణ్యత ఉండాలని బియ్యం కూరగాయలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వంట ఏజెన్సీలకు సూచించారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు

**నారాయణపేట టౌన్, డిసెంబరు 11 ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్, యాద్గిరి రోడ్డు మార్గంలో, సత్యనారాయణ చౌరస్తా, ఓల్డ్ బస్టాండ్ దగ్గర నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు, ఆర్సి, లైసెన్స్, పెండింగ్ చాలాన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్లో వాహనాలు నడపడం, త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ మొదలగు వాటి పై నారాయణపేట పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 04, ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు 35 కేసులు 18,500 రూ.జరిమానా విధించడం జరిగిందని, పెండింగ్ ఈ చాలాన్స్ 61 కేసులు 12,480/ జరిమానా చెల్లించారని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వాహన దారులకు కౌన్సిలింగ్ ఇచ్చి త్వరలో నెంబర్ ప్లేట్స్ వేయించుకోవాలని మళ్ళీ నెంబర్ ప్లేట్ లేకుండా, ట్రాఫిక్ నిబంధనలుఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై తెలిపారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపె వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వాహనాలకు హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లను, ప్రభుత్వం సూచించిన నెంబర్ ప్లేట్లను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. చాలా మంది దొంగతనాలు, దోపిడీలు చేయడానికి నెంబర్ ప్లేట్ లేని వాహనాలను ఉపయోగిస్తున్నారని అలాంటి వాహనాలను ఎవరు ఉపయోగించరాదని, నెంబర్ ప్లేట్లను ఇష్టమొచ్చినట్లు రాసుకో



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వడం, అనవసర రాతలు రాయరాదని, నెంబర్లు కనిపించకుండా చేస్తున్నారని ఈలాంటి వాటిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందనితెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ వాహనాలకు నెంబర్ ప్లేట్స్ తప్పనిసరిగా వేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా వాహనదారులు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌పాటించాలని వాహనాల డాక్యుమెంట్స్ ఆర్సి, లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకొరకు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని వాహనాలను మితిమీరిన వేగంతో నడపారాదని, రాష్ డ్రైవింగ్ చేయరాదు అని, మద్యపానం సేవించి వాహనాలు నడపడరాదని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, త్రిబుల్ రైడింగ్ వాహనాలు నడిపించరాదు అని, ఆటలలో అధిక మొత్తంలోవిద్యార్థులను, ప్యాసింజర్లను ఎక్కించుకోరాదని వాహన దారులు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసులకు సహకరించాలని సురక్షితంగా తమ గమ్యస్థానాలు చేరుకోవాలని ఎస్సై తెలిపారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 11 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు కదం తొక్కారు. తమకు న్యాయం చేయాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ 2వ రోజు ఆందోళన చేపట్టారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగారు. అందులో భాగంగా బుధవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని పాత కలెక్టరేట్ దగ్గర 2 రోజు దీక్షను కొనసాగించారు. తక్షణం రెగ్యులర్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులు చేతబట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. కేజీబీవీ సీఆర్టీలు, సీఆర్పీలు, డీఎల్ఎంటీ, సీసీఓ, పీటీఐ, మెసెంజర్, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళనకు తరలివచ్చారు. సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన ఈ



ఆందోళనకు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన కొనసాగిస్తామని సమగ్ర శిక్ష జెఏసి జిల్లా అధ్యక్షుడు మురళి హెచ్చరించారు. వివిధ సంఘాల ఉపాధ్యాయ నాయకులు జై శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రరావు, రాజిరెడ్డి, విజయ్ కుమార్, సురేందర్‌రెడ్డి, చిరంజీవులు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## శనివారం వరకు విధుల బహిష్కరణ

**గద్వాలడిసెంబరు 11 ప్రభాతవార్త:** గద్వాల బార్ అసోసియేషన్ తమ నిరసన నిర్ణయాన్ని మరింత తీవ్రతరం చేసింది. అందులో భాగంగా తమ విధుల బహిష్కరణ కార్యక్రమాన్ని మరో మూడు రోజులకు పొడిగించింది. జోగులాంబ గద్వాల జిల్లా కోర్టు సముదాయా నిర్మాణం పూడూరు శివారులో చేప్పట్టాలనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ గత సోమవారం నుంచి విధుల బహిష్కరణలో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా తమ నిరసనను మరో మూడు రోజులకు అంటే విధుల బహిష్కరణను శనివారం వరకు పొడిగిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ రఘురామి రెడ్డి, కొండాపురం షఫీ ఉల్లాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయానికిన్యాయవాదులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాగా తెలంగాణ, జోగులాంబ గద్వాల జిల్లా ఏర్పటు ఉద్యమం తరువాత న్యాయవాదులు ఏకధాటిగా ఆరు రోజులపాటు విధులను బహిష్కరించడం ఇదే మొదటిసారి.

## మురుగు కాల్వలో పడి వ్యక్తి మృతి

**కొత్తకోట డిసెంబరు11 ప్రభాతవార్త:** మద్యం మత్తులో కాల్వపై ఉన్న కల్వర్టు మీద కూర్చొని కాల్వలో జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన చాకలి వెంకటేష్ (40) మంగళవారం సాయంత్రం మద్యం మత్తులో పశువైద్యాశాల ముందు ఉన్న కల్వర్టుపై కూర్చున్నట్లు స్థానికులు తెలిపారు. కల్వర్టుపై జారి మురుగు కాల్వలో పడి మృతి చెందగా బుధవారం స్థానికులుగుర్తించి పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మురుగు కాల్వలో పడ్డ వ్యక్తిని బయటికి తీయగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతుని వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జిల్లా దవాఖానకు తరలించారు. మృతునికి భార్య ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

## నీటి పారుదల ప్రాజెక్టుల సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే

**గద్వాల డిసెంబరు 11 ప్రభాతవార్త:** హైదరాబాద్ జలసౌధ భవనంలో బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నీటి పారుదల ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, గద్వాల ఎమ్మెల్యేబండ్ల కృష్ణ మోహన్‌రెడ్డితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించినఎమ్మెల్యేలు అనిరుద్‌రెడ్డి, వీర్లపల్లిశంకర్, రాజేష్‌రెడ్డి, శ్రీహరి, మధు సుధన్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, నీటీపారుదల శాఖకు సంబంధించిన ఉన్న తాధికారులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

**మక్తల్, డిసెంబరు11 ప్రభాతవార్త:** ఇటీవల మక్తల్ పట్టణంలో జరిగిన మక్తల్ మండల స్థాయి సీఎం కప్ పోటీలలో మక్తల్ మండలంలోని సంగం బండ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు పాల్గొని తమ అసమాన క్రీడా ప్రతిభను కనబరిచే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలలో ప్రథమ స్థానం, ఖో ఖో పోటీలలో పాఠశాలకు చెందిన మొత్తం 43 మంది బాలికలు ప్రతిభను కనబర్చి జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ, కోచ్ బి.గోపాలం తెలిపారు. జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైన బాలికలు జిల్లాలో ఈ నెల 16 నుండి 21 వరకు జరుగు జిల్లా స్థాయి క్రీడలలోపాల్గొంటారని వారుతెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలను, అందుకు కృషి చేసిన కోచ్ బి. గోపాలంను, పీఈటీలు వేదవతి, శ్రీలతలను ప్రిన్సిపల్ చంద్రకళ, ఉపాధ్యాయబృందం బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

## సిసి రోడ్డు పనుల పరిశీలన

**కల్వకుర్తి, డిసెంబరు 11 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని 12 వార్డులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన నిధులతో చేపట్టిన సిసి రోడ్డు పనులను బుధవారం కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని గుత్తేదారులకు, అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, చిన్న రాంరెడ్డి, దాస్య, వెంకటేష్, దున్న సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ క్రీడ ఉత్సవాలు ప్రారంభం

**పెబ్బేరు డిసెంబరు11 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపల్ పరిధిలో బుధవారం రోజు మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో ఘనంగా సీఎంకప్ మండల స్థాయి క్రీడ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థిని విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొని వారి ప్రతిభను నిరూపించుకోవాలని క్రీడలవల్ల శరీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా లభిస్తుందని అధికారులు తెలియజేశారు. మండల స్థాయి సీఎం కప్ టోర్నమెంట్లో కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ, మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, ఎంపీడీవో రవీందర్, ఎంఈఓ జయరాములు, నోడల్ అధికారి, ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ కమిటీ, యువజన కాంగ్రెస్ కమిటీ, ఉపాధ్యాయ బృందం, పిడి, పిఈటిలు పట్టణ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం

**వెల్దండ, డిసెంబరు 11 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్ర సమీపంలోని పురాతన శివుని గుట్ట శివాలయ అభివృద్ధి కోసం మండల కేంద్రానికి చెందిన పిల్లి దేవేందర్ ముదిరాజ్ రూ.20 వేల విరాళాన్ని బుధవారం నిర్వాహకులకు అందించారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో మసిగుండ్ల వెంకటేష్, శేఖర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## పాక్షికంగా గ్రామ పంచాయతీ భవనం ధ్వసం

**కృష్ణ, డిసెంబరు 11 ప్రభాతవార్త :** మండల పరిధిలోని తంగడిగి గ్రామంలో ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయన్ని కొందరు నాయకులు కార్మికులతో రాత్రికి రాత్రి ఎటువంటి అనుమతులు లేకుండా ఉద్దేశం పూర్వకంగా ఆ స్థలాన్ని దేవాలయం స్థలం మార్చుకోవడానికి పూనుకుని, భవనంపై ఉన్న కుంభం, కిటికిపై ఉన్న సజ్జెలు, అక్కడక్కడా పాక్షికంగా ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు మంగళవారం ఆరోపించారు. నూతనంగా మంజూరు అయిన పంచాయతీ భవనం నిర్మాణం చేపట్టక ముందే ఉపయోగంలో ఉన్న పాత పంచాయితీ భవనాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా కూల్చడం ఏంటని గ్రామస్తులు ప్రశ్నించారు. నూతన భవనం నిర్మాణం అయ్యేదాకా ఉపయోగించుకునేందుకు అనుకూలంగా ఉన్నా భవన స్థలమే దృష్టిలో పెట్టుకుని కూల్చేందుకు కుట్ర పన్నినట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ భవనం పాక్షికంగా కూల్చిన వారి కేసులు నమోదుచేసి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి అందరు సహకరించాలి

**కల్వకుర్తి, డిసెంబరు 11 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ల ఉమా మనీలా అధ్యక్షతన మొదటి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి, ప్రధానంగా మార్కెట్ యార్డు మొత్తం సిసి వేయాలని, శిథిలావస్థలో ఉన్న దుకాణ సముదాయాన్ని పూర్తిగా తొలగించాలని, వర్షం నీళ్ళు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోవాలని, ప్రధాన రోడ్డు వైపు ఉన్న దుకాణాలకు మరమత్తులు చేపట్టాలన్నారు. 2 రోజుల్లో కమిషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించాలని, తదనంతరం కూరగాయలు కమిషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించాలని పలు తీర్మానాలు చేశారు. దశలవారీగా మార్కెట్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పండిత్ రావు, పాలక వర్గం సభ్యులు, మార్కెట్ కమిటీ కార్యదర్శి భగవంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు

### కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, డిసెంబరు 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పేద మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి మెరుగైన వైద్యానికి ఎంతో దోహద పడుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 9 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.2.90లక్షల చెక్కలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోళి సురేందర్‌రెడ్డి, లబ్దిదారులు వివద మండలాల చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే షురూ..

**జడ్చర్ల, డిసెంబరు 11 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల సర్వే కోసం ఇందిరమ్మ ఆప్ ద్వారా సర్వేయర్ వివరాలు సేకరిస్తున్నట్లు జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమాన్ని బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలతతో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రజా పాలనలో భాగంగా ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులు ఆధార్, సెల్ ఫోన్ నెంబర్, రేషన్ కార్డ్ నెంబర్ తో ఆప్ లో దరఖాస్తు వివరాలు అప్లోడ్ అయి ఉన్నాయని, సర్వేయర్ నిబంధనల మేరకు దరఖాస్తు ధారుని వివరాలు, ఇంటి స్థలం, ఇంటి లోపల, బయట ఫోటో కూడా ఆప్ లోడ్ చేయడం జరుగుతుంది. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు రాజీవ్ నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ప్రారంభించి వివరాలు సేకరించారు. ఇందిరమ్మ హౌసింగ్ యాప్ లో పూర్తి వివరాలు నమోదు చేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

## నీతి నిజాయితీతో ఉన్నప్పుడే పేరు ప్రతిష్టలు వస్తాయి

**లింగాల, డిసెంబరు 11 ప్రభాతవార్త:** నీతి నిజాయితితో ఉన్నప్పుడే సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు వస్తాయని అచ్చంపేట ఎమ్మెల్యే సతీమణి డా, చిక్కుడు అనురాధ అన్నారు. బుధవారం లింగాల మండల కేంద్రంలోని కాట్రావత్ శ్రీరాం(సీతారాం) కుటుంబ సభ్యులు నిర్వహించిన 29వ వర్ధంతి కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్రాం మంచికి నడవడికకు మంచి మార్గదర్శకంగా ముందుండి మండల ప్రజలకు సేవ చేసి మన్నలు పొందడం, ఇప్పటికి ప్రజల మనస్సుల్లో ఉండడం గొప్ప విషయం అన్నారు. కీ.శే. కాట్రావత్ శ్రీరాం ( సర్రాం) ఆయన కుమారులు తన తండ్రి సన్మార్గంలో పయనిస్తూ ఒకెలి ఉద్యోగం చేస్తూ, ప్రజలకు సేవ చేయడం చాలా అదృష్టం అన్నారు. ఆవేశంతో కాకుండా ఆలోచించి ముందుకెళ్లాలని సూచించారు. అంతకుముందు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేటమార్కెట్ చైర్మన్ అంతటి రజిత, కొండల్ రావు, బాలాజీ, మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, పట్టణ అధ్యక్షురాలు విజయ శ్రీరాం కుటుంబ సభ్యులు కాట్రావత్ రాజు, రాంజీ, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరవధిక సమ్మె

**గద్వాల, డిసెంబరు 11 ప్రభాతవార్త :** విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ల సాధన కొరకు నిరవధిక సమ్మె రెండవ రోజు కొనసాగించడం జరిగింది. ఈ నిరవధిక సమ్మెకు పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి మాట్లాడుతూ మీ యొక్క డిమాండ్స్ న్యాయమైనవని సాధించేవరకు పట్టు వదల వద్దని, మీ డిమాండ్స్ కంపల్సరీ నెరవేరుతాయని సూచించడం జరిగింది. సీఐటీయూ అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం విద్యా శాఖలో సమస్యలను పక్కనపెట్టి ఇంటిగ్రేటెడ్ స్కూలింగ్ సిస్టంను ప్రవేశపెడుతున్నారు. ముఖ్యమంత్రి విద్యా శాఖను తన దగ్గరే పెట్టుకుని విద్యా శాఖలోని సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు., ప్రస్తుతం ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎటువంటి సందర్భంలో అయినా ఎల్లవేళలా మీకు మా సీఐటీయూ తోడ్పాటుగా ఉంటుందన్నారు. ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ కరస్పాండెంట్, జేఏల్ అసోసియేషన్ డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ ఉద్యమాలు ఒక పద్ధతి ప్రకారం చేయాలన్నారు. ఇంతకుముందు మేము ఉద్యమాలు చేసేటప్పుడు కొంతమంది నిరుత్సాహపరిచిన మేము వెనకడుగు వేయలేదని 100 రోజులు సమ్మె చేశాం అన్నారు. ఎన్నో కష్టాలు పడినామన్నారు. మనందరికీ తెలుసు స్ట్రైక్ చేసే సమయంలో ఆర్థికంగా ఇతర, ఇతర మేనేజ్మెంట్ పరంగా చాలా తిప్పలు పడాల్సి వస్తుందని, అయినా కానీ ఉద్యమం విడవద్దని సూచించారు. అదేవిధంగా ఈరోజు ఇటిక్యాల కేజీబీవీ , స్పెషల్ ఆఫీసర్ ఆసియా బేగం మనోపాడు, కేజీబీవీ , స్పెషల్ ఆఫీసర్ అనురాధ గద్వాల కేజీబీవీ , స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి కేటీ దొడ్డి కేజీబీవీ , స్పెషల్ ఆఫీసర్ పద్మావతి కేజీబీవీ వడ్డేపల్లి , స్పెషల్ ఆఫీసర్ పద్మా ధరూర్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ గోమతి, అన్ని కేజీబీవీల నుండి సి.ఆర్.టి.లు పీజీసీఆర్టీలు, కేజీబీవీ ల నుండి నాన్ టీచింగ్ స్టాఫ్ కూడా ఈ సమ్మెలో పాల్గొనడం జరిగింది. అదేవిధంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఉషన్నప్ప గారు, జేఏసీ ప్రధాన కార్యదర్శి గోపాల్, సమగ్ర శిక్ష లోని అన్ని వింగుల అధ్యక్షులు పాల్గొని బుధవారం నిరవధిక సమ్మెను విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొనడం జరిగింది ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చెయ్యాలి అప్పటి వరకు పే స్కేల్ అమలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత భీమా 20 లక్షలు, ఆరోగ్య భీమా 10 లక్షల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పదవి విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద 25 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ, విద్యాశాఖ నియమకాలలో వెయిటేజ్ కల్పించాలి. పీటిఐ లకు 12 నెలలతో కూడిన వేతనం ఇవ్వాలన్నారు.

## ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన కమిషనర్

**నారాయణపేట టౌన్, డిసెంబరు11 ప్రభాతవార్త:** విద్యార్థుల భోజనం ఉన్నత నాణ్యత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని నారాయణపేట మున్సిపల్ కమిషనర్ వి.సునీత అన్నారు. బుధవారం మున్సిపల్ కమీషనర్ నారాయణపేటలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె తనిఖీ సమయంలో ఆమె ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశుభ్రత ప్రమాణాలను అంచనా వేసి అన్ని అడ్మినిస్ట్రేటివ్ రిజిస్టర్లను సమీక్షించారు. సిబ్బంది అంకితభావంతో పనిచేసినందుకు ప్రశంసించారు. కళాశాల మొత్తం నిర్వహణ పట్ల తన సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థుల శ్రేయస్సు, అభివృద్ధిని నిర్ధారించడానికి ఈ ఉన్నత ప్రమాణాలను కొనసాగించాలని ఆమె బృందాన్ని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా మైనారిటీ అధికారి ఎంఏ రషీద్, ఆర్.ఎల్.సి ఖాజా బహుద్దీన్, జిల్లా కోఆర్డినేటర్ సలీం కళాశాల వంటగది, బియ్యం సరుకులు పరిశీలించారు. స్టాఫ్ రిజిస్టర్ స్టాక్ రిజిస్టర్ పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. మోడల్ ప్రశ్నల పరీక్ష ప్రక్రియను పరిశీలించి అధ్యాపక బృందాన్ని అభినందించారు. నీట్, జెఈఈ పరీక్షల నిర్వహణపై శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్ తదితరులు ఉన్నారు.

## స్కానింగ్ సెంటర్‌ను వెంటనే వినియోగంలోకి తేవాలి

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 11 ప్రభాతవార్త :** మాత శిశు సంరక్షణ కేంద్రంలో స్కానింగ్ సెంటర్ ఉన్న డాక్టర్ లేక మూతపడిందని వనపర్తి ప్రజాసంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం, వనపర్తి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నర్సింగయపల్లి దగ్గర ఉన్న ఎం సి హెచ్ హాస్పిటల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధానంగా గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ సెంటర్ ఉన్న డాక్టర్ లేక మూతపడి బయట ప్రవేట్ హాస్పిటల్ కు గర్భిణీ స్త్రీలు వెళ్లావలసి వస్తున్నదని ప్రైవేటు స్కానింగ్ సెంటర్ వాళ్లదగ్గర వారి ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తూ గర్భిణీ స్త్రీలురాత్రింబవళ్లు కావలి ఉంటూ స్కానింగ్ తీసుకోవాల్సి వస్తుందని ఇంత పెద్ద హాస్పిటల్ ఉన్న డాక్టర్ లేకపోవడం చాలా దుర్మార్గం అన్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ యొక్క హాస్పిటల్ లో ఉండేసమస్యలు హాస్పిటల్‌కు వచ్చే గర్భిణీ స్త్రీల కొరకు స్కానింగ్ సెంటర్ వినియోగంలోకి తేవాలని అన్నారు. అదేవిధంగా 24 గంటలు మంచినీటి వసతి ఉండే విధంగా అక్కడ ఉండే సులబ్ కాంప్లెక్స్ వారు ప్రైవేటు వారు ఒక బకెట్ వేడి నీరు ఇవ్వడానికి 40, నుండి 60 రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బిల్డింగ్ పైప్ లైన్ నీళ్ల లీకైపేరుకుపోయిన పట్టించుకునే పరిస్థితి లేనందున అధికారుల స్పందించి తక్షణమే గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేసే విధంగా డాక్టర్ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మంచినీటి వసతి కల్పించాలని సులబ్ కాంప్లెక్స్ వారు అధిక రూపాయలు వసూలు చేయకుండా ప్రభుత్వ టాయిలెట్స్ నిర్మించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సిపిఎం టౌన్ కార్యదర్శి పరమేశ్వరాచారి, డి.కురుమయ్య ఐద్వా సంఘంజిల్లా అధ్యక్షురాలు, సాయి లీల, జిల్లా కార్యదర్శి ఎ, లక్ష్మి ,ఉమా, రేణుక, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ,ఆది, టౌన్ కమిటీ సభ్యులు , జి, బాలస్వామి, డివైఎఫ్ఐ నాయకులు ,మహేష్, తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

◆ **టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి**



మాట్లాడుతున్న టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు11 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు అన్నింటిని మంజూరు చేసి వారి ఖాతాలలో జమ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. టీఎస్ యుటిఎఫ్ మహబూబ్‌నగర్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం బుధవారం సాయంకాలం టీఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎన్ వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ఆఫీస్ పీరియడ్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన సందర్భంగా సంబరాలు జరుపుతున్నదని కానీ రాష్ట్రంలో గత సంవత్సర క్రితం పెండింగ్లో ఉన్న, ఈ కుబేరులో మూలుగుతున్న బకాయిలను ఇంకా ఇవ్వలేదని, నాలుగు డిఏలు పెండింగ్లో ఉన్నాయని, 2023 జూలై నుండి పిఆర్సి ని అమలు చేయాల్సి ఉందనీ, కానీ నూతన ప్రభుత్వం కూడా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కేజీబీవీ, యుఆర్ఎస్, కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ ఇచ్చి కనీస వేతనాన్ని అమలు చేయాలని, 317 జీవోలో ఉన్న లోపాలను సవరించి స్థానికతకు ప్రాధాన్యత ఇచ్చి స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను తమ సొంత ప్రాంతాలకు తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేశారు. టీఎస్ యుటిఎఫ్ జిల్లాఅధ్యక్షులు ఎన్.వెంకటేష్ మాట్లాడుతూ డిసెంబర్ 14నజడ్చర్ల పట్టణంలోజిల్లా మహాసభలు జరుగుతున్నాయని ఇట్టి మహాసభలకు పలువురు మేధావులు హాజరవుతున్నారని, కావున ఉపాధ్యాయుల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఉపాధ్యక్షులు పి ఉమాదేవి, ఆర్ నర్సింలు, జిల్లా కోశాధికారి వీ భాస్కర్, జిల్లా కార్యదర్శులు అజయ్, కిష్యానాయక్, రాములు, కృష్ణయ్య, వెంకటయ్య, కనకమ్మ, హేమంత్ కుమార్, మన్యం, సుదర్శన్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మోహన్ బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలి

### వనపర్తిలో ఐజేయు నిరసన



దాడిని ఖండిస్తూ నిరసన తెలుపుతున్న ఐజేయూ నాయకులు

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 11 ప్రభాతవార్త:** మీడియాపై మంచు మోహన్ బాబు చేసిన దాడి చేయడాన్ని ఖండిస్తూ బుధవారం ఐజేయు జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్రవ్యాప్త నిరసనలో పిలుపులో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రం రాజీవ్ చౌరస్తాలో టిడబ్ల్యూజె ఐజేయు వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలని, జర్నలిస్టులపై దాడిని ఖండించాలని, దాడికి పాల్పడ్డ మోహన్ బాబు పై చట్టరీత్యా కఠినంగా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. టియుడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ మాట్లాడుతూ సినిమా నటుడు పెద్ద రాయుడు మతిస్థిమితం కోల్పోయి జీరో రాయుడుగా తయారయ్యాడని ఆయన ఆరోపించారు. ఎన్నో సినిమా రంగాలలో దేవత రూపంలో నటనలు చేసిన మోహన్ బాబుఅయ్యప్ప స్వామి భక్తుడు స్వామి ధరించిన టీవీ9 జర్నలిస్టుపై దాడిచేసి అత్యాయత్నానికి పాల్పడిన విషయం సినిమా రంగానికి తెలంగాణ సమాజానికి సిగ్గుచేటని ఆయన విమర్శించారు, బాబుమోహన్ మతిభ్రమించి మతిస్థిమితం కోల్పోయి టీవీ9 విలేకరితోపాటు టీవీ5, ఈటీవీ విలేకరులపై దాడులు చేసి పత్రికా స్వేచ్ఛను భంగం కలిగించిన మోహన్ బాబు పైన కఠినమైన చట్టాల కింద అత్యా నేరం కింద కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు, పెద్దరాయుడుగా సినిమారంగంలో పేరు పొందిన మోహన్ బాబు జీరో రాయుడుగా మారాడని ఆయన ఎద్దేవా చేశారు, ప్రతినిత్యం ప్రతిక్షణం అణువు అణువునా ఎలాంటి జీతభత్యాలు లేకపోయినా జర్నలిస్టులు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అలాంటి జర్నలిస్టుల పట్ల ఈ మధ్యకాలంలో జరుగుతున్న దాడులను జర్నలిస్టులోకం సహించే ప్రసక్తి లేదని హెచ్చరించారు, అంతేకాక జర్నలిస్టుపై దాడి చేసినా మోహన్‌బాబు తమతప్పును కప్పిపుచ్చుకోవడానికి ఆసుపత్రిలో చేరి కపట నాటకం ఆడుతున్నాడని మధు గౌడ్ ఆరోపించారు, మీడియాపై మోహన్ బాబు దాడిని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నేడు పిడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు, మోహన్ బాబు మీడియా పట్లదురుసుగా ప్రవర్తించడం, అత్యాయత్నం చేయడంగా తాము భావిస్తున్నామన్నారు. చట్టపరంగా మోహన్ బాబు పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తమ యూనియన్‌తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అనంతరం ఐజేయు మాజీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ బాలస్వామి మల్యాల మాట్లాడుతూ యాక్షన్‌కింగ్ మోహన్ బాబు నటనలు జర్నలిస్టుల వద్ద సాగవని అన్నారు. జర్నలిస్టుల పట్ల దురుసుగా ప్రవర్తించిన మోహన్ బాబుపై చర్యలు తీసుకుని ఇంతవరకు జర్నలిస్టులోకం వదిలిపెట్టదన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజే ఐజేయూ జిల్లా కార్యదర్శి డి.మాధవరావు, స్టాఫ్ రిపోర్టర్లు రాజు, లక్ష్మణ్, విజయ్, ద్వారాపోగు మన్యం సీనియర్ జర్నలిస్టు కె రవిశంకర్ గౌడ్‌లతోపాటువహీద్, ఆంజనేయులు, అరుణ్ కుమార్, శ్రీనివాసులు, తదితర జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా గీతా జయంతి ఉత్సవాలు



భవద్గీత పుస్తకాలను అందజేస్తున్న మధుసూధన శర్మ

**కొల్లాపూర్, డిసెంబరు 11 ప్రభాతవార్త :** సమాజంలో మనిషి ఏ విధంగా జీవించాలో, తోటి ప్రాణులతో ఎలా ప్రవర్తించాలో శ్రీకృష్ణ పరమాత్ముడుభగవద్గీత రూపంలో లోకానికి అందించాడని కవి, రచయిత, తెలుగు భారతి సంస్థ ప్రధాన కార్యదర్శి వేదార్థం మధుసూదన శర్మ అన్నారు. బుధవారం గీతా జయంతి సందర్భంగా పెంట్లవెల్లి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదన శర్మ ప్రసంగిస్తూ, వేదాలు, ఉపనిషత్తుల సారమే భగవద్గీత అని, నిత్యజీవితంలో మానవులు ఎదుర్కొనే ఏ చిక్కు సమస్యకైనా భగవద్గీత ద్వారా పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు. విద్యార్థులు భగవద్గీతను పఠనం చేయడం ద్వారా, వారిలో ధారణాశక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానము సరఫరా చేసిన "మానవులందరికీ భగవద్గీత" అనే పుస్తకాలను ఆయన ప్రజలకు, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముమ్మిడి చంద్రశేఖరాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం విద్యార్థులచే గీతాపారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం సామూహిక సత్యనారాయణ స్వామివ్రతం, సాయంత్రం శ్రీ కృష్ణుని ఉత్సవ విగ్రహాల ఊరేగింపు మొదలైన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గీతా జయంతి సందర్భంగా, విద్యార్థులకు భగవద్గీతా కంఠస్థ పోటీలను నిర్వహించారు. విజేతలకు మధుసూదన శర్మబహుమతులనుఅందించారు. గీతాధ్యయన బృందం సభ్యులు, కొప్పుల బాల నారాయణ, దర్జీ శ్రీనివాసులు, బాండేకర్ ప్రవీణ్ కుమార్, కట్టా సాయిరాం, డా.పిట్టలసత్యం, కొప్పులచిన్నయ్య, వేములచంద్రశేఖర్ పాల్గొన్నారు.

**జడ్చర్ల, డిసెంబరు 11 ప్రభాతవార్త:** బాదేపల్లి పట్టణంలో రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సంస్కార భారతీయ ఆధ్వర్యంలో బుధవారం భగవద్గీత జయంతి పురస్కరించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత భక్తి పాటల కంఠస్థ పోటీల్లో గెలుపు పొందిన విద్యార్థులకు సంస్కార భారతీయ ఆధ్వర్యంలో సభ్యుడు గోనెల రాధాకృష్ణ ప్రశంసా పత్రం, బహుమతి ప్రధానం చేశారు. ప్రతి విద్యార్థి భగవద్గీత అధ్యాయం యోగ కంఠస్థం చేయడంలో దైవభక్తి తో భక్తి భావన పెంపొంది భగవద్గీత కంఠస్థంనేర్చుకోవాలని కోరారు. అదేవిధంగా అనురాగిణి ఆశ్రమంలో గీతా జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు విద్యార్థులతల్లిదండ్రువిద్యార్థులు పాల్గొన్నారు.

**చిన్నంబావి, డిసెంబరు 11 ప్రభాతవార్త :** చిన్నంబావి మండల కేంద్రంలో గీతా జయంతీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు మోహన్, నృత్య కళాకారుడు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి గీతా పారాయణం గావించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మండల పరిధి లోని వివిధ పాఠశాల విద్యార్థులచే నృత్యాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ సర్వ మానవాళికే దివ్య దిక్సూచి భగవద్గీత అని మానవాళికి నిత్యసందేశం గీతా అని, నిజ జీవితంలో వాస్తవాలను బోధించేదే భగవద్గీత అని ప్రపంచ దేశాలలో భగవద్గీతను మించిన సందేశాత్మకమైన ధర్మ గ్రంథం లేదని ఆన్నారు. అనంతరం చిన్నారులకు మెడల్స్ అందించి అభినందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగారి శ్రీనివాసులు, బీఎస్పీ అసెంబ్లీ కోఆర్డినేటర్ కురుమయ్య, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ నాయుడు, భీముడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఎన్ఎస్ఎస్ కంపెనీ నుండి కాలుష్యం అరికట్టాలి

### జిల్లా కలెక్టర్‌కు కొండేరు గ్రామస్తుల వినతి



**ఇటిక్యాల డిసెంబరు 11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండేరు. జింకల పల్లి గ్రామ రెవెన్యూ శివారులో నెలకొల్పిన ఎన్ఎస్ఎస్ కంపెనీ నుండి వచ్చే వాయు కాలుష్యంను అరికట్టాలని అలాగే పంట పొలాలలోకి వృధా గా వెళ్లే కలుషిత నీటిని రాకుండా చూడాలని బుధవారం కొండేరు గ్రామా నికి వరి కొనుగోలు కేంద్రం పరిశీలన అలాగే ఇందిరమ్మ ఇళ్ల యాప్ పరిశీలన కోసం వచ్చిన జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్‌కు కొండేరు గ్రామానికి చెందిన నాయకులు పోతురాజు సోమనాద్రి, మాజీ సర్పంచ్ మాజీ ఎంపిటిసి. వీరు బాబు గ్రామస్తులు కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే మీదృష్టికి పో ల్యూషన్‌కంట్రోల్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకుపో యామని ఇంకా ఇలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఎర్రవల్లి తహసిల్దార్ విచారణ కోసం వెళితే కూడా కనీసం యాజమాన్యం గేటును కూడా తెరవలేదని కలెక్టర్ దృష్టికి వారు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ బిఎం సంతోష్ వారితో మాట్లాడుతూకంపెనీపట్ల చాలా ఫిర్యాదులు వస్తున్నాయని ఒక అక్టోబర్ నెలలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తనిఖీ చేసి విచారించారని తాహసిల్దార్‌కు కంపెనీ ముందు ఉన్న గేటు కూడా తీయలేదని నా దృష్టికి వచ్చిందని ఇకనుండి రెవెన్యూ అధికారులు కంపెనీని తనిఖీ చేస్తున్న సమయంలో పోలీస్ బందోబస్తుతో వెళ్లాలని ఆదేశాలు ఇస్తామని పూర్తిస్థాయిలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులతో మాట్లాడి గ్రామాల ప్రజలకు కాలుష్యం తగ్గించేందుకు చూస్తామని కలెక్టర్ వారికి వివరించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేం దుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకురాగాబుధవారం కొండేరు గ్రామంలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న జాబితా ప్రకారం వారిని యాప్‌లో నమోదు చేస్తుండగా బుధవారం కొండేరు గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. యం సంతోష్. జిల్లా స్థానిక సంస్థల ఆదరణ కలెక్టర్ నర్సింగ్ రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్యాంసుందర్ గ్రామంలో గుడిసెలలో నివసిస్తున్న రెండు కుటుంబాలను ఈ యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని స్వయంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా యాప్ పనిచేస్తున్న సమయంలో లబ్ధిదారుల సర్వే సంఖ్యను పెంచాలని తప్పులు లేకుండా యాప్ లో ఇందిరమ్మ అర్హుల జాబితా కోసం నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియుద్దీన్, గ్రామ నాయకులు పోతురాజు సోమనాద్రి, వెంకటేష్, బీచుపల్లి, సిరాజ్, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ @ 100కోట్లు

మొదటి పేజీ తరువాయి భాగం..

సీఎంఆర్ ధాన్యాన్ని తిరిగి ఇవ్వాల్సిందేనని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 9వ తేదీనమిల్లర్లతో చర్చలు జరిపిన అధికారులు వారు మరొకసారి గడువు పెంచాలని కోరడంతో రాష్ట్ర ప్రభుత్వం జనవరి 15వ తేదీ వరకు వారికి చివరి గడువు కేటాయించింది. ఆలోపు పెండింగ్‌సీఎంఆర్ ఇవ్వనివారిపై నమోదైన కేసుల వారీగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం. ఈ అవకాశాన్నిమిల్లర్లు సద్వినియోగం చేసుకుంటారా లేకపోతే ప్రభుత్వం తీసుకునే చర్యలపట్ల ఏవిధంగాముందుకు వెళ్తారో వేచి చూడాల్సిందే.

**రైస్ మిల్‌పై కేసు నమోదు:** పానగల్ మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో ఉన్న శిరిడి సాయి ట్రేడర్స్ రైస్ మిల్లు పై కేసు నమోదు చేసిన పౌరసరఫరాల శాఖ మేనేజర్ వైపి రమేష్ మంగళవారం పౌరసరఫరాల శాఖఎన్ఫోర్స్మెంట్ ఏఎస్పీ ద్రోణాచార్య, డి.ఎస్.పి వెంకట్, డిటి నందకిషోర్ ఆధ్వర్యంలో రైస్ మిల్లు పై దాడులు నిర్వహించారు. గతంలో మిల్లుకు కేటాయించిన సీఎంఆర్ కేటాయింపుల్లో 1461,471 మెట్రిక్ టన్నులు దాని విలువ 4 కోట్ల 67 లక్షల 64 వేల 577 గా నిర్ధారణ చేసి యజమానిపై కేసు నమోదు చేశారు.

## ఇల్లు లేని నిరుపేదలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి భాగం..

బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలన్నారు. ఏ చిన్న పొరపాటు జరగకుండా పరీక్షకు అన్ని పక్కడబందీ ఏర్పాట్లు చేయాలని టీజీపీఎస్సీ ఛైర్మన్ చెప్పారు. ఎలక్ట్రానిక్ వాచ్ లు, మొబైల్స్, ఎట్టి పరిస్థితిలో అనుమతించకూడదని సూచించారు. నిర్దేశించిన సమయంలోనే అభ్యర్థుల్ని పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని చెప్పారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థలు, వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం 40శాతం మెస్ చార్జీలు పెంచిన నేపథ్యంలో డిసెంబర్ 14వ తేదీన విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు. అందులో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జీవెంకటేశ్వర్లు, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, డిఎస్పీ ఉమా మహేశ్వర్, ఇతర జిల్లా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్

మొదటి పేజీ తరువాయి భాగం..

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నర్సింగ రావు తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వరి ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించి తూకం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన రైస్ మిల్లులకు చేరేలా కృషిచేసి వెనువెంటనే ట్యాబ్ ఎంట్రీ చేయాలని సిబ్బందికి సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్న ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. రోజు వారీగా రైతుల నుండి ధాన్యం కొనుగోలు వివరాలు సేకరించి, ప్రతి రైతు నుంచి ఎన్ని క్వింటాళ్లు ధాన్యం తీసుకొచ్చారనే పూర్తి నివేదికను రూపొందించి అందుబాటులో ఉంచాలని తెలిపారు. స్వయంగా డిజిటల్ తేమమీటర్ ద్వారా ధాన్యంతేమ శాతాన్ని పరీక్షించి, కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17 తేమ శాతం రాగానే కాంటా వేసి మద్దతు ధరకు కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని అన్నారు. 24 గంటల్లో ఓపిఎం.ఎస్ లో అప్డేట్ అయ్యేలా చూడాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అన్ని వివరాలు రిజిస్టర్‌లో నమోదుతో పాటు ఆన్‌లైన్ లోని సమాచారంతో సమానంగా ఉండేలా సరి చూడాలని ఆదేశించారు. ప్రతికేంద్రంలో జరుగుతున్న ప్రక్రియలను నిశితంగా పరిశీలించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అడిషనల్ డి.ఆర్.డి.ఓ కు ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2320 కాగా, సన్నాలకు అదనంగా రూ.500 బోనస్ అందించనున్నట్లు వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యం ఏ విధంగానూ నిల్వ ఉండకుండా వీలైనంత త్వరగా మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాలని అధికారులకు ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగాసాగేలాకృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓనర్సింహులు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కలుపు నివారణపై రైతులకు అవగాహన

**మహబూబ్‌నగర్, డిసెంబరు11 ప్రభాతవార్త:** కోడ్గల్ గ్రామంలో మొక్కజొన్న పంటలో క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, భారతీయ మొక్కజొన్న పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డ్రా. సునీల్, మొక్కజొన్న ప్రధాన శాస్త్రవేత్త డా.నగేష్ కుమార్ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు, కలుపు నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కత్తెర పురుగు నివారణకు గాను స్పైనటోరం 0.5 ఎంఎల్ లీటరు నీటికి లేదా కోరజాన్ 0.4 ఎంఎల్ లీటరు నీటికి లేదా ఆంప్లిగో 0.4 ఎంఎల్ లీటరు నీటికి వాడుకోవాలని సూచించారు. అదేవిధంగా మొక్కజొన్నలో కలుపు నివారణకు గాను గడ్డి జాతి, వెడల్పాటి ఆకుల కలుపు నివారణకుకాలరీస్ ఎక్స్ట్రా1300 ఎంఎల్ ఎకరానికి లేదాకేవలం గడ్డిజాతి కలుపుకి లౌడిస్ 110 ఎంఎల్ ఎకరానికి వాడుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి బి.గోపినాథ్, వ్యవసాయ విస్తరణ అధికారి మరియు రైతులు శ్రీనివాస్‌రెడ్డి, బండ నర్సింలు, సాయిరెడ్డి జంగయ్య పాల్గొన్నారు.

## సీఎం కప్ బేస్‌బాల్ జట్ల ఎంపిక

**నారాయణపేట టౌన్, డిసెంబరు 11 ప్రభాతవార్త:** ఈనెల 18 నుండి 21 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి సీఎంకప్ 2024 లో పాల్గొనే నారాయణపేట్ జిల్లా బేస్‌బాల్ బాల బాలికల జట్లను ఈనెల 13న ధన్వాడ మండల కేంద్రంలోని అప్పాజీ క్రీడా మైదానంలో ఎంపిక చేస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి శెట్టి వెంకటేష్ తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనాల నుకున్న వారు సీఎం కప్ 2024 కు వారి పేరును నమోదు చేసుకుని ఉన్న వారు ఉదయం 10 గంటలకు డా.రామ్మోహన్ గౌడ్ పిడికి నివేదించగలరని వారు తెలిపారు.

## మీడియాపై దాడులకు పాల్పడితే సహించేది లేదు

**నారాయణపేట టౌన్, డిసెంబరు11 ప్రభాతవార్త:** సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడుతున్న మీడియాపై దాడులకు పాల్పడితే సహించేది లేదని టియుడబ్ల్యూజే ఐజేయు నారాయణపేట జిల్లా అధ్యక్షులు కోయిలకొండ నారాయణరెడ్డి అన్నారు. సినీ నటుడు మంచు మోహన్ బాబు మీడియా పై దాడి ఘటనను ఖండిస్తూ బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో టి యు డబ్ల్యు జే ఐజేయు ఆధ్వర్యంలో నిరసనగా ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించి జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్‌కు మోహన్ బాబు పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీడియాపై దాడులకు పాల్పడిన వారి పరిస్థితి గతంలో ఏమైందో ఒక్కసారిఆలోచించుకోవాలని హెచ్చరించారు. అన్యాయాన్ని అక్రమాన్ని నిక్కచ్చిగా సమాజానికి తెలియజేస్తున్న మీడియాపై దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టుల పరిరక్షణ సెక్షన్లను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రఘు గణప, నక్క శ్రీనివాస్, సంజీవ్‌ప్రకాష్, రమేష్, రాము, విష్ణువర్ధన్, శ్రీధర్, రమేష్ గౌడ్, వెంకట్ రాములు, సల్మాన్, నవాబ్ మధుసూదన్, వి.నరసింహ, శ్రీనివాస్, బాబా నరసింహులు, సురేష్ తో పాటు తదితరులు ఉన్నారు.